క్లుప్తంగా

రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరణ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన నిరుద్యోగ యువత ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం వరకు బీసీ అభ్యర్థుల నుంచి 357, ఎస్సీల నుంచి 386, ఎస్టీల నుంచి 306, క్రిస్టియన్‌ల నుంచి 2 , మైనార్టీల నుంచి 246 మంది అభ్యర్థుల దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో లక్ష్మన్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 14 వరకు గడువు ఉన్నట్లు పేర్కొన్నారు.

సామూహిక లింగాష్టక పారాయణం

బోథ్: సొనాల మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర మందిరంలో సోమవారం సామూహిక లింగాష్టక పారాయణం నిర్వహించారు. ఉదయం 7:30 గంటలకు ప్రారంభమైన సామూహిక లింగాష్టక పారాయణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా ప్రతీ సోమవారం ఆలయంలో లింగాష్టక పారాయణం నిర్వహిస్తామని శివాలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మొత్తం 21 వారాలపాటు సామూహిక లింగాష్టక పారాయణం కొనసాగుతుందన్నారు. దరామాయి శంకర్, గంగామణి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

తాంసి: గంజాయితో పాటు మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని జైనథ్ సీఐ సాయినాథ్ సూచించారు. భీంపూర్ మండలంలోని అందర్ బంద్ గ్రామంలో పోలీసులు మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి ఎవరూ పండించవద్దని, గంజాయి వంటి మత్తు పదార్థాలు తాగవద్దన్నారు. సైబర్ క్రైమ్స్,రోడ్డు భద్రత, 100 డయల్, షి టీమ్స్, మట్కా, బెట్టింగ్ నిషేధం, డ్రంక్ అండ్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించినారు. ఏఎస్సై ముంతాజ్, గ్రామపటేల్ హను పటేల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

బోథ్: మండలంలోని రాంనగర్ గ్రామంలో నానక్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు సోమవారం దగ్ధమైంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. నానక్ సింగ్ గ్రామంలో కొత్త ఇంటిని నిర్మించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో సామగ్రితో పాటు తన కుటుంబం పక్కనే ఉన్న గుడిసెలో ఉంటున్నారు. సోమవారం ఉదయం అకస్మాత్తుగా ఇంట్లో మంటలు చెలరేగాయి. దీంతో ఇల్లు మొత్తం కాలి బూడిదైంది. ఇంటి సామగ్రితో పాటు విలువైన పత్రాలు, బంగారం, నగదు కాలిపోయాయి. దాదాపు రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నాడు.

కత్తితో బెదిరించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: కత్తిని చూపిస్తూ చంపేస్తానని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో చించర్‌వాడకు చెందిన తోట విఙ్ఞేష్ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా కత్తి చూపిస్తూ చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ర్యాలీలో నిందితుడు కత్తితో తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు చేసేలా ప్రవర్తించాడని తెలిపారు. అతనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

ఇచ్చోడ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని వైష్ణవ సధన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని ముఖరా(కె)లో నిర్వహిస్తున్న సప్తహం కార్యక్రమంలో పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. మనుషులలో ఈర్ష్యా, ద్వేశంతో సాటి మనుషులపై ప్రేమ, గౌరవం లేకుండా పోయాయన్నారు. ప్రతిఒక్కరూ నిత్య జీవితంలో కొంత సమయాన్ని ఆధ్యాత్మికతకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంఘం రాష్ట్ర కార్యదర్శి బలరాం జాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొలాన్ని సందర్శించకుండానే పంటల సర్వే

ఆదిలాబాద్‌రూరల్: పంట పొలాన్ని సందర్శించకుండానే వ్యవసాయాధికారులు పంట సర్వే చేపట్టి వివరాలు నమోదు చేస్తున్నారని ఆదిలాబాద్‌రూరల్ మండలం భీంసరి గ్రామానికి చెందిన రైతు శైబాష్ ఖాన్ ఆరోపించాడు. ఆయన మాట్లాడుతూ తనకున్న 1.5 ఎకరాల్లో జొన్న పంటతో పాటు కూరగాయలు సాగు చేస్తున్నట్లు తెలిపాడు. ప్రస్తుతం నీరందక జొన్న పంట ఎండిపోయి దిక్కుతోచని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలాంటి సమయంలో ఏఈవో పంట పొలాన్ని సందర్శించకుండానే పొలంలో ఎలాంటి పంటలు వేయలేదని వివరాలు నమోదు చేయడం సరికాదని మండిపడ్డాడు. దీంతో నష్టపరిహారం కోసం దరఖాస్తు చేసుకునే వీలు లేకుండా పోయిందని వాపోయాడు. రైతు భరోసా కోసం సర్వే జరిగితే ఎలా ప్రశ్నిస్తున్నాడు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే చేపట్టేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పంట వ్యర్థాలకు నిప్పు



దీపాయిగూడలో కాలిపోయిన జొన్నపంట

- పలుచోట్ల అగ్ని ప్రమాదాలు
- కాలిపోతున్న వ్యవసాయ సామగ్రి
- నష్టపోతున్న రైతులు

తాంసి: యాసంగిలో సాగు చేసిన పంటలు ప్రస్తుతం చేతికి వస్తున్నాయి. ముందస్తుగా సాగుచేసిన రైతుల వివిధ పంటలు ఇప్పటికే దిగుబడి వచ్చాయి. పంట చేతికి వచ్చాక రైతులు భూములను త్వరితగతిన చదును చేసుకునేందుకు పంట వ్యర్థాలకు, పొలం గట్లపైన నిప్పు పెట్టి కాల్చుతున్నారు. జిల్లాలో ప్రధానంగా యాసంగి సీజన్‌లో జొన్న, గోధుమ, వేరుశనగ, పెసరి, మినుము, మొక్కజొన్న, నువ్వు పంటలను అధికంగా సాగు చేశారు. పంటలు కోసిన అనంతరం కొయ్యలు, వ్యర్థాలకు రైతులు నిప్పు పెట్టి కాల్చి వేస్తున్నారు. దీంతో భూసారం తగ్గుతుంది. నిప్పురవ్వలు ఎగిసి పడి అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. అలాగే వ్యవసాయ సామగ్రి కూడా కాలిపోతుంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఏటా అగ్ని ప్రమాదాలు..

మండలంలోని పలు గ్రామాల్లో పంటచేలకు నిప్పు పెట్టడంతో అనేక చోట్ల అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రతీ ఏటా వేసవిలో ఎక్కడో ఒక చోట వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో పంటలు కాలిపోతున్న ఘటనలు జరుగుతున్నాయి. వరుసగా ఘటనలు జరుగుతున్న రైతులలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. గత నాలుగు రోజుల క్రితం జైనథ్ మండలంలోని దీపాయిగూడ, ఆనంద్‌పూర్ గ్రామాల శివారులో పంట చేనులో జొన్నపంట అగ్నికి కాలిపోయింది. దీపాయిగూడ గ్రామానికి చెందిన రైతు గిరిదర్ రెడ్డి మూడు ఎకరాల్లో, ఆనంద్‌పూర్ గ్రామానికి చెందిన రతన్ రెడ్డిది ఎకరంన్నర పంట పూర్తిగా కాలిబూడిదైంది. గతేడాది తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన రైతు గట్టు గంగన్న చేను పక్కనున్న రైతు వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో 7 ఎకరాల్లో జొన్నపంట కాలిపోయింది. తాంసికి చెందిన రైతు అశోక్ జొన్న పంట సైతం అగ్ని ప్రమాదంతో కాలిపోయింది.

అధికారులు అవగాహన కల్పించాలి..

చేలలోని వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో కలిగే అనార్థాల గురించి అధికారులకు రైతులు అవగాహన కల్పించాలి. నిప్పు పెట్టడంతో చేలలో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంట చేలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పించి వ్యర్థాలను కలియదున్నే విధంగా చూడాలి. వ్యర్థాలు కలియదున్నడం వలన కలిగే లాభాలను వివరించారు. పంట దిగుబడి పెరిగి మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

జొన్నపంట కాలిపోయింది



యాసంగిలో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని జొన్న పంట సాగు చేశాను. పక్కనున్న పంట చేలలో రైతుల లేక రోడ్డు వెంట వెళ్లేవారు ఎవరైనా పంట వ్యర్థాలకు నిప్పు పెట్టారు. పంట వ్యర్థాలకు పెట్టిన నిప్పు జొన్న పంట చేలలోకి పంట పూర్తి కాలిపోయింది. దాదాపు రూ.1లక్షకు పైగా నష్టం వాటిల్లింది.

– గిరిధర్ రెడ్డి, రైతు, దీపాయిగూడ

వ్యర్థాలను కాల్చొద్దు



రైతులు పంటలను కోసి దిగుబడులు వచ్చిన తరువాత పంట కొయ్యలు, వ్యర్థాలను తగులబెడుతున్నారు. దీని వలన భూసారం తగ్గే అవకాశం ఉంది. ప్రతీ ఏటా రైతులు సులువుగా తమ సాగు భూమిని చదును చేసుకోనే క్రమంలో వ్యర్థాలను ఇష్టానుసారంగా కాల్చి వేస్తున్నారు. దీంతో పక్కనున్న పంటచేను రైతులు ఎక్కువగా నష్టం వాటిల్లుతుంది.

– రవీందర్, వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీఏ, తాంసి

పాఠశాల భవనానికి భూమిపూజ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో సీబీఎస్‌ఈ పాఠశాల భవనం కోసం సోమవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు భూమిపూజ చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. శిశు మందిరాలు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం ప్రాంత సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అందరికీ న్యాయం జరిగేలా చూస్తా

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని వాంకిడి గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాబితాలో కొందరికీ ఇళ్లు రాలేదని, వారికి కూడా వచ్చేలా చూస్తానన్నారు. ఎవరూ కూడా ఆందోళన చెందవద్దన్నారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు గ్రామాన్ని కాలినడకన సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నానక్ సింగ్, రాజు, రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, అనిల్ యాదవ్, పండరి, గులాబ్, నజీర్, భారత్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే

మహాసభలను విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఈనెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించే తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీలపై కొనసాగుతున్న దమనకాండకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వేట్టి మనోజ్‌కుమార్, అత్రం మహేందర్, సలాం వరుణ్, సిడాం గంగారాం పటేల్, తొడసం రాము, భీముడు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మాభూమి రథయాత్ర జయప్రదం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల రాజ్యస్థాపన కోసం డాక్టర్ విశారదన్ మహరాజ్ చేపట్టే లక్ష కిలో మీటర్ల 'మా భూమి రథయాత్ర'ను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఏప్రిల్ 14న ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ మైదానంలో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రకులాల పేదలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సుకుమార్ పెట్కులే, రవి, సాంబన్న, శ్రీనివాస్, ధర్మ సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్, డీఎస్పీ నాయకులు నవీన్ మహరాజ్, గంగన్న, రాంచందర్, శ్రీనివాస్, విను కుమార్, గోవర్ధన్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సన్నబువ్వ రుచి చూసిన అధికారులు

కైలాస్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న సన్నబియ్యం వినియోగంపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో సన్నబియ్యం లబ్ధిదారు కనపర్తి రాధా నివాసంలో డీఎస్‌వో ఎండీ, వాజీద్ అలీ, సివిల్ సప్లై డీఎం సుధారాణి, మావల మండల తహసీల్దార్ వేణుగోపాల్‌లు మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యతపై ఆరా తీశారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్ రాథోడ్ బాబుసింగ్, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి మధుకర్, ఆర్ఐ అమృత్‌రావు, అనిల్ పాల్గొన్నారు.



భోజనం చేస్తున్న అధికారులు

బాల్య వివాహాలపై అవగాహన

బోథ్: సొనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్ , చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 అంశాలపై సోమవారం చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలన్నారు. ఫోన్ చేసిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. పిల్లలందరూ చదువుపై శ్రద్ధ ఉంచి మిగతా విషయాలన్నిటిని పక్కన పెట్టి సమాజంలో ఉన్నత స్థానాన్ని చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీడీఎస్ సూపర్‌వైజర్ జంగుబాయి మాట్లాడుతూ బాల్యవివాహాల వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సచిన్, ఉపాధ్యాయులు రడాపు మధుసూదన్, ప్రతాప్, ఓన శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సతీష్ కుమార్

రైతుభరోసా నిధులు విడుదల చేయాలి

ఇంద్రవెల్లి: ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతుభరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. సోమవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో మాట్లాడారు. రైతు భరోసాపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటి వరకు నాలుగు ఎకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్న 1లక్ష మంది రైతులకే రైతు భరోసా పెట్టుబడి సాయం అందిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతు భరోసా నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు సుదర్శన్, సుమిత్రబాయి, సోనుబాయి, విజ్జుబాయి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

రేపు అమరవీరుల స్తూపం వద్ద సమావేశం

ఇంద్రవెల్లి: భూమి కోసం భుక్తి కోసం పోరాటం చేసి 1980 ఏప్రిల్ 20న పోలీసు కాల్పుల్లో అసువుల బాసిన అమరవీరులకు ఈనెల 20న నిర్వహించే సంస్మరణ దినోత్సవం ఏర్పాట్లపై ఈనెల 9న స్తూపం వద్ద అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు రగల్ జెండా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తొడసం నాగోరావ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొమ్మిది తెగల అదివాసీ సంఘాలు, రాయిసెంటర్ సార్‌మెడిలు, ఆయా గ్రామాల పటేళ్లతో సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు కొట్నాక్ దేవ్‌షావ్, పుర్కా చిత్రు, జుగ్నాక్ భారత్, మెస్రం భారత్, మడావి ఇంద్రు, చహకటి నాగోరావ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాంతినగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య పరంగా పాటించాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి హాజరైన పారిశుద్ధ్య కార్మికులు

సంగెం సుధీర్‌కుమార్‌కు సేవా పురస్కారం

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కే) గ్రామానికి చెందిన న్యాయవాది సంగెం సుధీర్‌కుమార్ సేవా పురస్కారం అందుకున్నాడు. హైదరాబాద్‌లో తాగ్యరాయ గాన సభలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసుదన్‌చారి చేతులు మీదుగా అవార్డును అందుకున్నారు. 212 వారాలుగా ఆదిలాబాద్ పట్టణంలో నిరుపేదలకు అన్నదానం నిర్వహిస్తున్నందును ఈ అవార్డు అందచేశారు. కార్యక్రమంలో మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకులభారణం కృష్ణమోహన్, సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, సత్య సంగీత ఇంటర్నేషల్ అధ్యక్షుడు ఓంకార్‌రాజు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న సుధీర్‌కుమార్

ఘనంగా ఆటల దినోత్సవం



ఆటలు ఆడుతున్న విద్యార్థినులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అనుకుంటలో మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలలో సోమవారం మహిళ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మహిళ సాధికారత ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆటల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలికలు ఈ ఆటలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పెషలిస్టు కృష్ణవేణి మాట్లాడుతూ ఆటల దినోత్సవంలో భాగంగా ఆడ పిల్లను రక్షిద్దాం.. ఆడ పిల్లను చదివిద్దాం కార్యక్రమంలో సందర్భంగా విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించారు. అందులో భాగంగానే క్రీడల జెండా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు. క్రీడలు ఆరోగ్యానికి వ్యాయామం లాంటివన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది కోటేశ్వర్, నిఖిలేశ్వర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

'పెట్రో ధరలు పెంచడం సరికాదు'

ఆదిలాబాద్‌టౌన్: బీజేపీ ప్రభుత్వం అధిక ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తోందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు నింగినంటుతుండగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచడంతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారిందన్నారు.

నేడు బీసీ, మాలీ సంఘాలతో సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 11న నిర్వహించనున్న మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం బీసీ సంక్షేమ సంఘం, మాలీ సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి నాయకులు హాజరు కావాలని పేర్కొన్నారు.

నేడు శాంతి ర్యాలీ

ఆదిలాబాద్‌టౌన్: క్రైస్తవ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆదిలాబాద్ పట్టణంలో శాంతిర్యాలీ నిర్వహిస్తున్నట్లు పాస్టర్లు సురేష్, రాకేష్, రాజు, హరికిషన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ పగడాల మృతి పట్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కిరణ్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా కిరణ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు

సంక్షిప్తం

నిర్వహిస్తున్న రవీందర్ రెడ్డి ప్రస్తుతం మహబూబాద్ డీఈవోగా వ్యవహరిస్తున్నారు. దీంతో కళాశాల లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న కిరణ్ కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు.

నేడు చెక్కుల పంపిణీ

బోథ్: బోథ్, సొనాల మండలాలకు సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఉదయం 11 గంటలకు బోథ్ మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించనున్నట్లు బోథ్, సొనాల తహసీల్దార్లు సుభాష్, మల్లేష్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఇచ్చోడ: వసతి గృహం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణతో పాటు, భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

9న రాంజీగోండు వర్ధంతి సభ

నేరడిగొండ: ఈ నెల 9న గుడిహత్నూర్‌లో నిర్వహించనున్న మర్సుకోల రాంజీగోండు 166వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు మొకాశి సోమవారం పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

బోథ్: జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సొనాల మండల నాయకులు సోమవారం మండల కేంద్రం నుంచి ఘన్పూర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అంతకు ముందు అంబేడ్కర్ శివాజీ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అనిల్ రమేష్, గాజుల పోతన్న రాము పోశెట్టి, ఇసురు పటేల్ పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ వలలో పడొద్దు

సిరికొండ: సైబర్ క్రైం వలలో పడవద్దని ఇచ్చోడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భీమేష్ అన్నారు. మండలంలోని ధర్మసాగర్ గ్రామంలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. అనవసర ఫోన్ కాల్స్‌కు సమాధానం ఇవ్వద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై శివారం , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఉపాధిహామీ కార్యాలయంలో తాత్కాలిక అటెండర్‌గా పనిచేసే రమేశ్ గత వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. దీంతో సోమవారం రమేశ్ కుటుంబ సభ్యులకు ఎంపీడీవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో రూ 30,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో నరేందర్‌గౌడ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5లక్షల చెక్కు అందజేత

కైలాస్‌నగర్: ఎలుగుబంటి దాడిలో గాయపడ్డ తలమడుగు మండలంలోని నందిగ్రామ గ్రామానికి చెందిన మేస్రం లచ్చు అనే వ్యక్తికి ప్రభుత్వపరంగా రూ.5లక్షల ఆర్థికసాయం మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కును సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా బాధితుడికి అందజేశారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో శ్యాంసుందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్తులతో కలిసి జ్యోతి ప్రజల్వన చేశారు. చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చింతామన్, మాజీ సర్పంచ్ రాజన్న, ఉపాధ్యాయులు శివారెడ్డి, ప్రభాకర్, ప్రియాంక, భూమన్న పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు